# సత్యవాక్యము

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

MARCH - 2001

# సంక్షిప్త వార్తలు

2001 జనవరి 29వ తేదీ సోమవారం ఆచంట మండలం ములపర్రు పెదగర్వ్రులో సువార్తికుల సదస్సు జరిగెను. ఆచంట ఏరియాలో పనిచేయుచున్న సువార్తికుల యొక్క క్షేమాభివృద్ధి కొరకు ఈ సమావేశము జరిగెను. సమావేశము యం.జోసఫ్‌గారి ప్రార్ధనతో ప్రారంభమాయెను. కె.దామోధరరావ్, కె.మోజెస్, యస్. రవికుమార్ గార్లు పాటలు నడిపించిరి. జి.చిట్టిబాబు గారు వాక్యపఠనం గావించిరి. యస్.మోజెస్ (కరుగోరుమిల్లి) గారు వాక్య పరిచర్య చేసిరి. సమావేశము జి.సూర్య ప్రకాశరావ్ గారి ప్రార్ధనతో ముగిసెను. పెదగర్వ్రులోను పరిసర ప్రాంతములలోను సోదరులు గోసాల సూర్య ప్రకాశరావ్ గారు, వారి కుమారుడు చిట్టిబాబు గారు వాక్యపరిచర్య చేయుచున్నారు. ఆచంట మండలంలో జరుగుచున్న సువార్త పనికొరకు ప్రార్ధించమనవి.

2001 ఫిబ్రవరి మొదటి తేదీ గురువారం నాడు తూర్పుగోదావరి జిల్లా ఉప్పలగుప్తం బడుగువారిపేటలోను, పేరాయి చెర్వు ఆదిలక్ష్మిపేటలోను జరిగిన సువార్త కూటములలో సోదరులు హర్షల్ బియర్డెన్, డేన్ గేనాన్ గార్లు పాల్గొని వాక్య పరిచర్య చేసిరి. ఒకరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఈ రెండు గ్రామాలలోను క్రీస్తు సంఘ ఆలయ నిర్మాణము నిమిత్తము జాషువాగూటం గారు తగు ఏర్పాట్లు చేయుచున్నారు. బడుగువారి పేటలో పండ అర్జనరావ్, ఆదిలక్ష్మి పేటలో పెయ్యేల సత్యనారాయణ గార్లు వాక్య పరిచర్య చేయుచున్నారు.

ఫిబ్రవరి 10వ తేదీ శనివారం పశ్చిమ గోదావరి జిల్లా తాళ్లపూడిలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయము క్రీస్తు పనికొరకు ప్రతిష్టింపబడెను. అమెరికా నుండి వచ్చిన సోదరులు మైకేల్ హ్యూజ్, గ్లెన్ హిచ్‌కాక్, బిల్ న్యూకూంబ్, మరియు జాషువా గూటం (కాకినాడ) గార్ల చేతుల మీదుగా ఆలయము ఘనముగా ప్రతిష్టింపబడెను. తదుపరి పైనుదహరించిన సోదరులు వాక్య పరిచర్య చేసిరి. సోదరులు వి.సుదర్శనరావ్ (రాజమండ్రి) గారు నాటి కూటమునకు అధ్యక్షత వహించి సభను ఘనముగా నడిపించిరి. సోదరులు ఎం.సామ్యూల్ రాజు (బిక్కవోలు), ఎ.విశ్వేశ్వరరావ్ (కొవ్వూరు), పి.ఎస్.ఆర్.జయపాల్ (ర్యాలి) మొదలగు సహోదరులు ఈ కార్యక్రమమునకు హాజరై తాళ్లపూడి క్రీస్తు సంఘమును, స్థానిక సంఘ సువార్తికులు బి.ప్రసాద్‌గారిని అభినందించిరి. తాళ్లపూడి క్రీస్తుసంఘ అభివద్ధిని గూర్చిన రిపోర్టును సోదరులు బి.ప్రసాద్‌గారు సభికులకు చదివి వినిపించిరి. వచ్చిన వందలాది సోదర సోదరీలకు స్థానిక సంఘము మంచి విందు నేర్పాటుచేసిరి. సోదరులు బి.ప్రసాద్‌గారు యౌవన కాలములోనే క్రీస్తు కొరకు మంచిపనిని చేయుచు, మంచి ఫలితములు సాధించు

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 363722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 21 మార్చి 2001 సంచిక 8

# పరలోకమందున్న దేవుడు
## (The God in Heaven)

"వర్షమునకు తండ్రి యున్నాడా? మంచు బిందువులను పుట్టించు వాడెవడు? మంచు గడ్డ యెవని గర్భములో నుండి వచ్చును? ఆకాశము నుండి దిగు మంచును యెవడు పుట్టించును? " ఇట్టి అనేక ప్రశ్నలను యెహోవా దేవుడు యోబును అడిగినట్లు మనం బైబిలు గ్రంథములో చూడగలము (యోబు 38:28-29). వీటన్నిటికి దేవుడు అనే జవాబు వస్తాది.

దేవుని యొక్క ఉనికిని గూర్చిన గొప్ప రుజువేమిటంటే ప్రతీ కార్యానికి వెనుక ఒక కారణం ఉంటాది. Every effect must have a cause. దీనినే కారణ-కార్యముల సూత్రం అని చెబుతారు. It is the law of cause and effect. గ్రీకు వేదాంతియైన ప్లేటో (Plato) భూమి, సూర్యుడు, నక్షత్రములు, ఈ విశ్వమే దేవుని ఉనికిని చాటుచున్నవని

చెప్పాడు. దేవుడే సూర్య, చంద్ర నక్షత్రములను చేసెనని అతడు చెప్పాడు.

1969లో జూలై 20వ తేదీన అమెరికా వ్యోమగాములు మొట్టమొదటిగా చంద్రునిపై దిగారు. వారు చంద్రునిపైనున్న రాళ్లను, బూడిదను భూమిపైకి తీసికొని వచ్చారు. చంద్రునిలో నున్న మట్టిలోను, రాళ్లలోను టైటేనియమ్, సిలికాన్, అల్యూమినియమ్, ఇనుము, మెగ్నీషియమ్, కేల్షియం, సోడియం, పొటాషియం మొదలగు ఖనిజములను కనుగొన్నారు. అయితే చంద్రునిలోను, భూమిలోను ఉన్న పదార్థములన్నీ వాటికవే వచ్చి పడిపోలేదు. వాటిని సృజించిన కారణం, లేక వ్యక్తి ఒకరు తప్పక ఉండియుండాలి. ఏలయనగా శూన్యము నుండి శూన్యము వచ్చును. ఇంకోమాటలో యేమీలేకుండా, యేమీ రాదు అని మనం గ్రహించుకోవచ్చును. Of nothing, nothing comes.

మనం చూస్తున్న విశ్వము ఉన్నది. నిర్దేవులు, నాస్తికులు విశ్వం యొక్క ఉనికిని అంగీకరిస్తారు. అయితే ఈ విశ్వాన్ని ఎవరు కలుగజేసారు? ఏదైనా ఒక సంగతి తన ఉనికిని గూర్చి వివరణ ఇచ్చుకోలేకపోతే అది మరొకరిపై లేక మరొకదానిపై ఆధారపడియుండిన దవుతాది. ఈ విశ్వము అలాంటిదే. అది ఉనికిలోనికి ఏలాగు వచ్చినదో చెప్పుకోలేదు. గనుక ఈ విశ్వం ఏలాగు కలిగింది?

ఈ ప్రశ్నకు మూడురకాలుగా జవాబును అన్వేషించవచ్చును. ఈ మూడింటిలో ఏదో ఒకటి సత్యమై యుండాలి. మొదటిది, ఈ విశ్వము నిత్యము ఉండేది. అది నిత్యమూ వుంటాది. రెండోది, ఈ విశ్వము నిత్యమైనది కాదు. అది తనకు తానే సృష్టించుకొన్నది. మూడోది, ఈ విశ్వం నిత్యమైనది కాదు. గాని దానిని ఎవరో సృజించారు. ఈ మూడింటిని మనం క్లుప్తముగా పరిశీలించుదాం.

ఈ విశ్వము నిత్యమూ వుండేదా? Is the Universe eternal ? దేవుడు లేడని చెప్పేవారు ఈ విశ్వము నిత్యము వుండేదే యని చెబుతారు. వారి ఉద్దేశ్య ప్రకారం ఈ విశ్వానికి ఒక ఆది అంతము లేదు. అయితే నేను ఈ ప్రసంగమును సిద్ధపరచుచుండగా, ఈ విశ్వానికి 1400 కోట్ల వయస్సున్నట్లు శాస్త్రజ్ఞులు నిర్ధారించి చెప్పినట్లు మన వార్తాపత్రికలు ప్రచురించాయి. (ఈనాడు, ఆగస్టు 10, 2000). అంటే ఈ విశ్వానికి ఒక ఆది అంటూ యున్నది. అయితే దాన్ని ఆరంభించిన వాడెవరు?

మన రెండో ప్రశ్న ఈ విశ్వము నిత్యమైనది కాదు గాని అది తనకు తానే సృజించుకొన్నది. శూన్యము నుండి ఈ విశ్వము తనకు తానే సృజించుకొన్నది యని కొందరు విద్యావేత్తలు చెప్పజూచారు. అదే యదార్థమైతే విజ్ఞానశాస్త్రములోని మొదటి సూత్రానికి అది విరుద్ధం. శూన్యము నుండి శూన్యము వచ్చును. ఈ విశ్వం తనకుతానే సృష్టించుకోలేదు. అట్టి భావములు శాస్త్రీయముగాను, వేదాంతరూపముగాను అసంభవము.

మూడవదిగా ఈ విశ్వము సృజింపబడినదా అనే ప్రశ్నను వేసుకొందాం. ఈ విశ్వానికి ఒక ఆదియంటూ ఒకటి ఉండియుండాలి. లేదా అది లేకుండా అయినా యుండాలి. మనకు లభ్యమయ్యే వాస్తవములన్నిటిని బట్టి ఈ విశ్వానికి ఒక ఆదియున్నదని గ్రహించుకోగలము. దీనికొక ఆది, (beginning) అంటూ యుంటే దాన్ని సంకల్పించిన ఒకకారణం లేక cause ఉండియుండాలి.

ఈ విశ్వం నిత్యము వుండేదికాదు గనుక, అది దానికదే సృజించుకొనియుండలేదు. గనుక ఈ విశ్వాన్ని ఎవరో ఒకరు సృజించియుండాలి. ఆ సృష్టికర్త అన్నిటికంటె ముందునుండి యుండాలి, నిత్యము ఉండియుండాలి, ఆయన నిత్యము ఉండియుండాలి, సృష్టము కంటె ఉన్నతుడై యుండాలి. దీనితో మరొక సంగతిని మనం గమనించాలి. ఒకప్పుడు యేమీలేకపోతే ఇప్పుడును యేమీ వుండదు. అయితే ఇప్పుడు కొంతయున్నది గనుక ఏదోఒకటి ఎల్లవేళలా ఉండెను. ఉనికి కలిగియున్న ప్రతిది పదార్థము గాని లేక ఆత్మగాని అయ్యుండాలి.

గనుక ఉనికి కలిగియున్న ప్రతి సంగతి పదార్థము లేక ఆత్మయైయున్నది. ఏదోకొంత ఇప్పుడు ఉనికి కలిగియున్నది. గనుక ఏదోకొంత నిత్యము ఉండియున్నది. గనుక పదార్థముగాని, ఆత్మగాని నిత్యము ఉండియుండాలి. పదార్థము, నిత్యత్వము కలిగినది కాదని యిదివరకే గ్రహించాము. గనుక ఆత్మ నిత్యము ఉండునది యని మనం గ్రహించాలి.

విశ్వసృష్టి విషయక శాస్త్రము యొక్క ముఖ్య వర్తమానము యేమంటే: ప్రతి భౌతిక కార్యానికీ, దానిముందున్న కారణం ఒకటి ఉండియుండాలి. ఈ విశ్వం ఇక్కడయున్నది; జ్ఞానం ఇక్కడయున్నది, ప్రాణం ఇక్కడయున్నది, ధర్మము ఇక్కడయున్నది, ప్రేమ ఇక్కడయున్నది. వీటికి సమానమైన పూర్వకారణం యేమిటి? కారణానికి ముందు

కార్యం ఎన్నడు యుండదు గనుకను, కారణానికంటే కార్యం మిన్నకానందు వలనను జీవానికి కారణం దానికి ముందునుండీ యున్న సజీవమూర్తియే. "ఆది యందు దేవుడు ..." అను మాటలతో బైబిలు ఆరంభించబడినప్పుడు, ఆ మాటలలోనే ఆ ముందున్న కారణాన్ని వివరించినది. ఆయనే దేవుడు.

మనం నివసించుచున్న విశ్వాన్ని గమనించితే దానిలో గొప్ప క్రమము, ఏర్పాటు (arrangement) కనబడతాది. దానియంతటిలో సంకల్పము మనకు కనబడతాది. ఆ విశ్వసంకల్పం వెనుక సంకల్పించిన ఒకమూర్తి కూడా తప్పక ఉండియుండాలి.

క్రమము తప్పకుండా వచ్చు రుతువులు, అవన్నియు మాసములు సంవత్సరములుగ విభజింపబడి చలించుట వలన దేవుని యొక్క ఉనికి గ్రాహ్యమగుచున్నదని ప్లేటో (Plato) చెప్పాడు. అంతేకాకుండా వెదకాలమును కోతకాలమును శీతోష్ణములను వేసవి శీతాకాలములను, రాత్రింబగళ్లను ... ఈ క్రమము అంతా వాటితాలూకు చట్టాన్ని యిచ్చినవానిని సూచించుచున్నవి (ఆది కా.8:22).

1682వ సంవత్సరంలో ఎడ్మండ్ హేలే (Edmond Halley) అను బ్రిటీషు ఖగోళశాస్త్రవేత్త ఒక ఉల్కను అంతరిక్షంలో కనుగొన్నాడు. ఖగోళ సూత్రముల యదార్థతను అతను ఎరిగినవాడై, తాను కనుగొనిన ఉల్క ప్రతి 76 సంవత్సరముల కొకమారు భూమి యొక్క గగనతలములో ప్రత్యక్షమగునని చెప్పాడు. దానినే మనము హేలీ తోకచుక్క (Halley's Comet) అని పిలుస్తాము. అతడు చెప్పినట్లే ఇప్పటికి అది నాలుగుసార్లు 1758, 1835, 1910, 1986 సంవత్సరాల్లో కనబడింది. ఎడ్మండ్ హేలీ 1742లో చనిపోయెను గాని అతడు కనుగొనిన ఖగోళ శాస్త్రసూత్రము ఇంకా యదార్థముగానే యున్నది.

అమెరికా దేశపు అంతరిక్ష వ్యోమగాములు పలుమారులు చంద్రుని మీదికి వెళ్లి వచ్చారు. 1971 ఫిబ్రవరి 5వ తేదీనాడు అమెరికా అంతరిక్ష యాత్రికులు ఎలెన్ షెపర్డ్, ఎడ్గర్ మిట్చెల్, స్టూవర్ట్ రూస అనువారు చంద్రునిపై దిగారు. భూగోళము నుండి 6 దినములు పయనించిన తరువాత వారు చంద్రునిపైకి చేరుకోగలిగారు. దానిపై తమ పనిని ముగించుకొని క్షేమముగా భూమికి తిరిగివచ్చారు. అయితే ఈ అంతరిక్ష యాత్రలు విజయవంతం కావాలంటే ప్రకృతి సూత్రములను, గణిత సూత్రములను ఆయా శాస్త్రజ్ఞులు,

ఎరిగియుండి వాటిని బట్టి ఈ యాత్రలు సంకల్పించియుండాలి. ఈ సూత్రములన్నియు చలించనివి. ఈ ప్రకృతి సూత్రములు ఆధారపడలేనట్టివైతే మానవుడు చంద్రుని దగ్గరకుగాని, అంతరిక్షములోనికి గాని పయనించియుండలేడు.

ప్రకృతి యొక్క జ్ఞాన విశిష్టత మానవుని యొక్క జ్ఞాన విశిష్టతకు ముందున్నట్టిది. అయితే జ్ఞాన విశిష్టత దానికిముందున్న జ్ఞానము నుండియే ఉద్భవించియుండాలి. విశ్వములో యున్న నిశ్చలమైన క్రమము ఒకగొప్ప గణితజ్ఞుని, గొప్ప విజ్ఞానవేత్తను సూచించుచున్నది. మానవుని జ్ఞానము నానాటికీ వికసించుచునేయున్నది. గత శతాబ్దములో అనేక క్రొత్త సంగతులు కనుగొనబడినవి. అవన్నియు ఆదినుండి యున్న ప్రకృతి సూత్రములను మానవుడు గ్రహించుకొనుట ద్వారా సంభవించినవి. విజ్ఞాన శాస్త్రవేత్తలు జ్ఞానము వికసించే కొలదీ వారు ఆశ్చర్య కరుడైన దేవుని జ్ఞానమును కొనియాడుచున్నారు.

దేవుని ఉనికిని గూర్చిన సందేహము మనకుండ వలసినపనిలేదు. నిజానికి దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు (కీర్తన 14:1). గాని విశ్వాసులు, "యెహోవా మా ప్రభువా, ఆకాశములలో నీ మహిమను కనుపరచువాడా, భూమి యందంతట నీ నామము ఎంత ప్రభావము గలది" యని చెప్పి దేవుని కొనియాడుదురు (కీర్తన 8:1).

000

# ఆయనకు భయపడుడి !
## ( Fear Him ! )

బోధకు డొకడు ఒక స్త్రీతో తన ఆత్మను గూర్చి సంభాషించుచు, ఆమె క్రైస్తవురాలో కాదో యని తెలిసికొనగోరెను. నేను క్రైస్తవురాలను కానని ఆమె ఉత్తరమిచ్చెను. ఆమె క్రీస్తు చిత్తమునకు లోబడుట అవుసరమని అతడు చెబుతు, "క్రీస్తు లేకుండా నీవు పరలోకమునకు వెళ్లలేవనెను". అంటే నేను క్రైస్తవురాలను కాకపోతే నరకానికి పోదునని నీ ఉద్దేశ్యమా? యని ఆమె ప్రశ్నించెను. బైబిలు అట్లే బోధించు చున్నదని యతడు

జవాబిచ్చెను. వెంటనే ఆమె కోపము తెచ్చుకొని, "నేను నరకానికి పోవుచున్నానని చెప్పుటకు నీకెంత ధైర్యము? నాపై తీర్పును ప్రకటించ డానికి నీకు హక్కు లేదు. నీ మాటలను నేను వ్యతిరేకించుచున్నాను. క్రైస్తవులు తీరు యిట్లుంటే, నేనెన్నడు క్రైస్తవురాలను 'కానని' ఆమె ప్రకటించెను.

కొంతకాలము మట్టుకు వాక్యాన్ని బోధించుచున్న మనందరం ఇట్టి సందర్భాలను ఎదుర్కొనిన వారమే. అయితే ఒకటి మాత్రం మనం ఖచ్చితంగా చెప్పవచ్చు; క్రీస్తు, అపొస్తలులు, ఆదిమ క్రైస్తవులు వాక్యాన్ని బోధించు నపుడు దేనికీ జంకలేదు. ఉన్నది ఉన్నట్లుగానే వారు బోధించిరి. బోధించునప్పుడు ప్రయోజనకరమైన దేదియు పొలు దాచుకొనలేదు (అపొ.కా.20:20). దేవుని సంకల్పము నంతటిని అతడు బోధించెను (అపొ.కా.20:27).

కాలమంతటిలోను నిశితంగా బోధించిన వాడు మన ప్రభువైన యేసుక్రీస్తు. ఆయన యిట్లు చెప్పెను. "ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి గాని, ఆత్మను దేహమును కూడ నరకములో నశింపజేయగల వానికి మిక్కిలి భయపడుడి" (మత్తయి 10:28). ఈ లేఖన భాగాన్ని మరికొంత లోతుగా ఆలోచిద్దాం.

మొదటిగా, నశింపజేయగల వాడెవరు, దేవుడా? సాతానా? నశింప జేయగలవాడు దేవుడే యని నేరుగా ఈ లేఖన భాగం చెప్పుట లేదు. అయితే ఆయన యెవరు? కొందరు సాతానని అనుకొంటారు. గాని, కాదు. సాతానుకు మితిలేని శక్తి అప్పుడు లేదు, ఇప్పుడు లేదు. అపవాది యొక్క క్రియలను లయము చేయుటకు యేసు క్రీస్తు ఈలోకమునకు వచ్చెను (1యోహాను 3:8). సాతానుడు నరకముపై రాజుకాదు, సరిగదా సాతానే నరకములో పడద్రోయబడును, మరియు శపించబడిన వారందరితో కలసి నిత్యము నరకశిక్ష ననుభవించును (ప్రకటన 20:10). మన లేఖన భాగంలో నశింపజేయువాడు దేవుడే. యాకోబు 4:12 యిట్లు చెప్పుచున్నది :"ఒక్కడే ధర్మశాస్త్రమును నియమించి న్యాయము విధించువాడు; ఆయనే రక్షించుటకును నశింపజేయుటకును శక్తిమంతుడై యున్నాడు; పరునికి తీర్పు తీర్చుటకు నీవెవడవు?". క్రీస్తు మరల వచ్చునప్పుడు దేవుని నెరుగనివానికి, సువార్తకు లోబడని వారికి నిత్య శిక్షను విధించును. ( 2 థెస్స 1:7-9). తీర్పు దినమందు

ఎడమవైపున ఉన్న వారిని అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలో త్రయున పడవేయును (మత్తయి 25:41, 46).

రెండవదిగా, నాశనము చేయుట లేక నశింపజేయుట అనేమాట యొక్క అర్థమేమిటి? సమూలనాశనం (annihilate) అనునది దాని యర్ధము కాదు. గాని ప్రయోజనకరమగు జీవిత నాశనం అని దాని యర్థం. శరీరముకును ఆత్మకును నరకంలో సంభవించు నాశనం అది.

క్రీస్తు కొరకు తమ ప్రాణము లర్పించిన క్రైస్తవులను జ్ఞాపకం చేసికొందాం. వారు తమ ప్రాణాలను కోల్పోయారు గాని దుష్టులు వారి ఆత్మలను మాత్రం ముట్టుకొనలేరు. మరణమొందునట్లు వారు శారీరకంగా వారిని బాధపెట్టి యుండవచ్చును: అయితే వారి ఆత్మలను హింసించుట అపవాది వశము కాదు. యేసు ఆయన గొర్రెలను గూర్చి చెబుతు, "నేను వాటికి నిత్యజీవము నిచ్చుచున్నాను గనుక అవి ఎన్నటికిని నశింపవు, ఎవడును వాటిని నా చేతిలో నుండి అపహరింపడు. వాటిని నాకిచ్చిన నా తండ్రి అందరికంటె గొప్ప వాడు గనుక నా తండ్రి చేతిలో నుండి యెవడును వాటిని అపహరింపలేడు" అని చెప్పెను. (యోహాను 10:28-29). 1 యోహాను 4:4ను కూడ దయచేసి చదువండి.

చిన్న నరకాన్ని గూర్చిగాని, చిన్న పరలోకాన్ని గూర్చిగాని, చిన్న రక్షకుని గూర్చిగాని బైబిలు ఎన్నడు చెప్పలేదు. అయితే నరకం యదార్థం. అది ఘోరమైనది. నిత్య నాశన స్థలమది (ప్రకటన 14:10-11). నేనక్కడి వెళ్లగోరుటలేదు. మీరు కూడా అక్కడికి వెళ్లకూడదు. గనుక దాన్ని గూర్చి మనం యేమి చేయాలి?

మూడవదిగా, దేవుడు మన శరీరాత్మలను నరకంలో నాశనం చేయగలడనే సత్యాన్ని గూర్చిన మనస్పందన ఎట్లున్నది? మొట్టమొదటిగా మనలో భయం కలగాలి! ఆయనకు భయపడుడి! మనము దేవుని యందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడల ననుసరించి నడుచు చుండవలెను. మానవ కోటికి ఇదియేవి? (ప్రసంగి 12:13). మనము వినయ భయభక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవచేయాలి, ఏలయనగా మనదేవుడు దహించు అగ్నియై యున్నాడు! (హెబ్రీ 12:28-29).

రెండవదిగా దేవుని శక్తికి భయపడి పాపమువైపు మరల ఎన్నడు మనం చూడరాదు! పాపము ఎంత ఘోరమైనదో గ్రహించడానికి మనకు చాల సమయం పట్టి యుండవచ్చును. పాపము భయంకరమైనదని పౌలు తెలియ జేయుచున్నాడు. (రోమా 7:13). ఈ లోకము. సంఘము కూడా పాపమును గూర్చి మరచి నట్లగుపడుచున్నది! ఆత్మీయముగా ఈ లోకము అంతకంతకు అధోగతి పాలవుచున్నది. మిత్రులారా, " పాపము వలన వచ్చు జీతము మరణము! " (రోమా 6:23; యాకోబు 1:15; యెహెజ్కేలు 18:20).

మూడవదిగా, దేవుని శక్తికి భయపడి మన జీవితములు ఆయన చేతిలో యున్నవని మనం గ్రహించాలి! మన శరీరాత్మలను నరకంలో వేయగల శక్తి ఆయనకే యున్నది! (ప్రక 1:8; యెషయా 9:6-7).

చివరిగా, మనం గ్రహించిన సత్యములనొకసారి సింహావలోకనం చేద్దాం. మరణం గొప్ప విషాదమని మన సమాజం ఎంచుతాది. అయితే మరణం కంటే ఘోరమైనది ఇంకొక్కటి యున్నదని మన లేఖన భాగం చెప్పుచున్నది. క్రీస్తు కొరకు మరణించవలసిన వారికి మనలేఖన భాగం ఆదరణ నిచ్చును కూడా. మానవులు శరీరాన్ని తీసికోవచ్చును, చంపవచ్చును గాని ఆత్మను చంపలేరు. గనుక మన తదుపరి జీవితాన్ని గూర్చి మనం ఆసక్తి కలిగియుండాలి. ప్రస్తుతాన్ని గూర్చి మనం ఆలోచిస్తు చాల సమయాన్ని గడుపుతాం. గాని అక్కడిని గూర్చి మనం ఎక్కువ ఆలోచించాలి. ఆత్మలను సంపాదించుటకు ఈ లేఖన భాగమును బట్టి మనం మరింత పురికొల్పబడాలి. "కావున మేము ప్రభువు విషయమైన భయము నెరిగి మనుష్యులను ప్రేరేపించు చున్నాము" (2 కొరింధీ 5:11).

## దేవునికి హక్కున్నది !

నీసమయంలో కొంతభాగానికి నిశ్చయంగా దేవునికి హక్కున్నది
దాన్నంతటినీ తీసేసుకోడానికి ఆయనకు శక్తి వున్నది !

నీ ధనంలో కొంత భాగానికి నిశ్చయంగా దేవునికి హక్కున్నది
దాన్నంతటినీ తీసేసుకోడానికి ఆయనకు శక్తి వున్నది !

నీ నాలుక ద్వారా మహిమ పర్చబడడానికి దేవునికి హక్కున్నది
దాన్నంతటినీ తీసేసుకోడానికి ఆయనకు శక్తి వున్నది !

నీ పలుకుబడి ద్వారా ఘనపరబడే హక్కు ఆయనకున్నది
దాన్నంతటినీ తీసేసే శక్తి ఆయన కున్నది !

నీ జీవితంపై దేవునికి హక్కున్నది
దాన్నంతటినీ తీసేసుకొనే శక్తి ఆయనకు కున్నది !

క్రైస్తవేతరు లందరు ఈ లేఖనమును బట్టి ఆలోచనలో పడాలి. బైబిలును గూర్చి మీకేవైన ప్రశ్నలుండవచ్చును. కయీనుకు భార్య ఎక్కడ దొరికిందో తెలిసికొనగోరుచున్నావేమో. అద్భుతాలు, శ్రమలు వెయ్యేండ్ల పాలన వగయిరాలను గూర్చి నీకు ప్రశ్నలుండవచ్చును. అయితే నేటి లేఖన భాగమును బట్టి నీ మనస్సులో ఒకే ఒక్క ప్రశ్న యుండాలి. అదే "రక్షించబడుటకు నేనేమి చేయాలి?" అనునది. ఫిలిప్పుయి చెరసాల అధిపతి ఆ ప్రశ్నను అడిగాడు. అతడు దేవతారాధికుడు. అతడు యేసు ప్రభువు నందు విశ్వసించాలి యని చెప్పబడింది. ఆ రాత్రివేళ పౌలు, సీలాల గాయములను కడిగి తన మారుమనస్సును అతడు వ్యక్తపర్చాడు (అ.పొ.కా.16:30-34). అపొ.పౌలు చెప్పినట్లు అతడు ఆరాత్రే బాప్తిస్మము పొందాడు. అతడును అతని యింటివారును బాప్తిస్మము పొంది, క్రైస్తవులయ్యారు. శరీరాత్మలను నరకములో పడవేయగల దేవుని శక్తి విషయమై వారికిక భయములేదు. నీవు కూడ అట్లు చేస్తే, నీకూ నరకాన్ని గూర్చిన భయం వుండదు.

మనం దేవునికి భయపడాలి! నశింపజేయు దేవుడాయన! ఈ లోకం అంతా దుష్టత్వములో యున్నపుడు దాన్ని ఆయన జలప్రళయం ద్వారా నాశనం చేసేసాడు (ఆదికాండము 9 అధ్యా). కాలాంతమందు ఈ లోకాన్ని ఆయన అగ్నితో నాశనం చేయును (2 పేతురు 3:10-12). దీనిని బైబిలు పదే పదే మనకు బోధించుచున్నది. ఆయన కుమారుడును, ఈ లోక రక్షకుడైన యేసుక్రీస్తుకు లోబడని వారిని నశింపజేయుటకు దేవునికి శక్తి వున్నది. అది ఆయన చిత్తమైయున్నది. ఆయనకు భయపడు ! !

\- జాన్ స్టేసీ

# నిత్య జీవిత తృష్ణ
# (Man's Longing for Immortality)

భూమిమీద మానవుల వయోపరిమాణము స్వల్పకాలమే అయినను వారందరిలో సహజముగా ఒక కోరిక యున్నది. అది నిత్యము జీవించవలెననెడి కోరిక. చావు అనిన సహజముగ భయపడువాడు మానవుడు. గోత్రకర్తయగు యోబు అలనాడెప్పుడో 'మరణమైన తరువాత నరులు బ్రతుకుదురా?' యని ప్రశ్నించి తనలో యున్న నిత్యజీవిత తృష్ణను వెలిబుచ్చెను. (యోబు 14:14). యోబు వేసిన ప్రశ్న మానవజాతి ఆరంభమైన నాటినుండి నేటివరకు వేయబడుచున్న ప్రశ్నయై యున్నది. హేబెలు చనిపోగా ఆదాము హవ్వలు, చివరకు కయీనుకూడ అతడు మరల బ్రతుకునా? యని ఆలోచించి యుండకపోరు. లక్షలకొలది మానవులు నేడు చనిపోవుచున్నారు గనుక ఇది మనము తరుచు ఎదుర్కొనుచున్న ప్రశ్నయై యున్నది. 'మరణమైన తరువాత నరులు బ్రతుకుదురా? యని యోబు అడిగిన ప్రశ్న ఈనాడు మన ప్రశ్నయై యున్నది. గనుక మనందరము అమర్త్యతను (Immortality) వెదుకుచున్నామని ఒప్పుకొనక తప్పదు.

అయితే అమర్త్యత (Immortality) అనగా యేమిటో ఒకడు మరణించిన తరువాత అతని ఆత్మ జీవించి యుండుట లేక ఉనికిని కలిగియుండుట అమర్త్యత అని సాధారణముగ అందరు తలంచెదరు. అంటే - ఒకడు మరణ మొందగానే అతడు అంతమొంది యుండలేదు అని అందరు అంగీకరించుచున్నారు. ఇందువిషయమై బైబిలు చెప్పునదేమంటే - ఒకడు మరణించగా అతని ఆత్మ జీవించుచునేయుండును. సరిగదా ఒకానొక దినమందు అది నిత్యత్వము (Eternity) లో ప్రవేశించునపుడు శరీరముతో పునరుత్థానమగును. ఆత్మ శరీరముతో ఏకమై మరి ఎన్నటికి ఎడబాయకుండు నిమిత్తము లేపబడును. క్రైస్తవునికి ఇది బహు ధన్యకరమైన స్థితి యగును.

నిత్య జీవితము యధార్థమైనదని మానవులు నమ్ముటకు అనేక ఋజువు లున్నవి. పురాతన నాగరికతలను మనము పరిశోధించిన యెడల వేలకొలది సంవత్సరముల క్రితమున్న ప్రజలకు నిత్య జీవితము నందు నమ్మిక మున్నదని ఋజువగుచున్నది.

ఉదాహరణకు ఐగుప్తు దేశీయులు ఆకాశము నంటుకొని యున్నట్లు నిర్మించబడిన పిరమిడ్లు (గోపురములు) దీనికొక సాదృశ్యముగ యున్నవి. భారతీయులలో పునర్జన్మను గూర్చిన యభిప్రాయములు ప్రబలియున్నవి. దీనిని బట్టి మానవుడు [illegible] నిర్మూలించబడుటకు కాదు గాని ఏదో ఒక రీతిగ తను శాశ్వత ఉనికిని కలిగియుండుటకు ఆశించుచున్న వానిగా కనబడుచున్నాడు.

మానవజాతి యంతటిలోను మార్పు జెందని కొన్ని నిత్య సత్యములున్నవి. అవి ఒకే ఒక్క దేవునియందు నమ్మిక కలిగియుండుట, మంచి చెడు అను విచక్షణ జ్ఞానము, భావి జీవితమందు ప్రగాఢమైన విశ్వాసము, క్రియ ప్రక్రియలను గూర్చిన జ్ఞానము మొదలగునవి. ఇవి సార్వజనికమైనవి. మానవులకు వీటిని గూర్చి యెవరును బోధించకనే వారు వీటిని యెరిగి యున్నారు. ఈ సంగతులను గూర్చిన వారి జ్ఞానము ఎక్కడునుండి వచ్చినదో మనము వివరించుకొన లేకపోయినను వారి విశ్వాసము ఆధారము లేనిదికాదు.

ఈ భూమిపై యున్న జీవరాసులన్నియు ఏదో ఒక ప్రయోజనమును కలిగియున్నవి. కొన్ని మానవునికి ఆహారము కొరకు ప్రయోజనకారియై యున్నవి. కొన్ని క్రిమి సంహారకులు గాను, మరికొన్ని మన వాతావరణమును పరిశుభ్రముగా నుంచునవి గాను యున్నవి. అయితే ఈ పుడమిపై మానవుని ప్రయోజనమేమిటి? అతడు తన సృష్టికర్తయైన దేవుని కొనియాడుచు, మహిమ పరచుచు ఆయనతో నిత్యము జీవించుటకు చేయబడని యెడల మరెందుకు అతడు చేయడెను?

మానవుని భౌతిక సంబంధమైన కోరికలను తీర్చుకొను ఆధారము భూమిపై యున్నది. శబ్దతరంగములను పరిగ్రహించుటకు చెవులు అవుసరము. వర్ణములను గుర్తించుటకు నేత్రములవుసరము. వాతావరణములోని గాలిని పీల్చుటకు ఊపిరితిత్తులు అవుసరము. ఆహారమునకు ఆకలియు, దాహమునకు దప్పికయు అవుసరము. ఈ భౌతికావుసరము లన్నిటిని తీర్చుకొనుటకు మానవుని శరీరమును దేవుడు తయారు చేసెను. అట్లయినపుడు నిత్యము జీవించవలెనని మానవుని కున్న ఆత్మీయ తృష్ణను దేవుడు తీర్చడా?

ప్రకృతిని మనము గమనించుట ద్వారా అమర్త్యత మరింత నిశ్చయము అని మనకు ఋజువు అగుచున్నది. గొంగలిపురుగు సీతాకోక చిలుకగా మారి స్వేచ్ఛగా తిరుగులాడుటలో మానవుని కున్న నిత్యజీవిత తృష్ణ తీర్చబడగలదని విశ్వసించవచ్చును. ఈ శరీరబంధకముల

నుండి మానవుని ఆత్మ నిత్యత్వములో ప్రవేశించుట ఆ పురుగులో మనకు కన్పడుచున్నది. ప్రకతిలోని ఋతువులే మరణమును, సమాధిని, అనగా కొంత కనిపెట్టు కాలమును, అటుతరువాత అతి మనోహరమైన క్రొత్తజీవితము జీవించుటకు ఒక పునరుత్థానమును సూచించుచున్నవి. అయా సంగతుల ద్వారా మానవుడు ఈ లోక జీవితము కంటె ఘనమైన జీవితము కొరకు ఎదురు చూడవచ్చునని దేవుడు చెప్పకపోతే వాటియొక్క ప్రయోజనమేమి? అందుకే "దేవుని అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి' ' యని అపొ.పౌలు రోమా 1:20లో వ్రాసెను.

మానవుని నైతిక పరిజ్ఞానమే నైతిక విలువలు కాపాడు దేవుడొకడు ఉన్నాడని మనకు తెలియజేయుచున్నది. ఈ లోకమంతయు ఒక నైతిక చక్రములో యుండి పరిభ్రమించుచున్నట్లు మనము చూడగలము. ఈ నైతిక చక్రములో మానవుడు తన క్రియలను బట్టి ప్రతిఫలము నొందుటకో లేక శిక్ష ననుభవించుటకో ఎదురు చూచుచున్నాడు. అయితే ఒక్కోసారి నీతిమంతులు శ్రమల నొందుట, దుర్మార్గులు సుఖముగ జీవించుట, సజ్జనులు పరాజయులగుట, దుర్జనులు విజేయులగుట మనము చూచుచుందుము. అట్టి సమయాల్లో మానవులు ఈ జీవితములో కాకపోయిన భావి జీవితంలో న్యాయమును దేవుడు తప్పక తీర్చునని యెదురు చూచుట సహజము. ఆ భావిజీవితంలో నీతిమంతులకు న్యాయము చేకూర్చబడుట, అనీతిమంతులు తగిన రీతిగ శిక్షింపబడుట జరుగునని మనందరము యెదురు చూచుచునే యున్నాము. నిత్యజీవితం అంటూ లేనియెడల మానవునికున్న ఈ నైతిక విలువల ప్రయోజనము శూన్యమే గదా.

నిత్య జీవితమనునది నమ్మదగిన వాస్తవమని బైబిలు బోధించుచున్నది. పాత నిబంధనలో ఇద్దరు భక్తులు హనోకు, ఏలియా అనువారు మరణమును రుచి చూడకనే పరమునకు కొని పోబడుటను గూర్చి చెప్పబడియున్నది. మరియు దేవుడు నిర్ణయించిన ఒకానొక [illegible]మందు "సమాధులలో నిద్రించు అనేకులు మేలుకొనెదరు. కొందరు నిత్యజీవము అనుభవించుటకును, కొందరు నిందపాలగుటకును నిత్యముగా హే[illegible]లగుటకును మేలుకొందురు" అని దానియేలు 12:2లో వ్రాయబడి యున్నది.

యేసుక్రీస్తు నందు నిత్యజీవితము దృఢమైన వాస్తవమని మనకు మరింత తేటగా బోధింపబడినది. మరణించిన వారిలో ప్రధమఫలముగా ఇకనెన్నడు మరణించకుండు

నిమిత్తము క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నాడు. యేసుక్రీస్తు మానవజాతికి నిత్యజీవితమును ప్రసాదించుట కొరకు చనిపోయెను. యేసుక్రీస్తు మరల రాబోవుచున్నాడని, మృతుల పునరుత్థానము జరుగునని, తీర్పు తప్పక జరుగునని, ఈ జీవితములోన ప్రతివాడు తాను చేసిన క్రియలను బట్టి ప్రతిఫలమో లేక శిక్షయో పొందునని చేయబడిన వాగ్దానము లన్నియును మనము నిత్యము జీవించెదమని నిర్ధారణ చేయుచున్నవి. (యోహాను 5:28-29, మత్తయి 10:28, 1 కొరింధి 15:53-54, 2 కొరింధి 5:1-4).

'కుమారుని యందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు, కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడుగాని దేవుని ఉగ్రత వానిమీద నిలచియుండును' అని యేసు బోధించెను. (యోహాను 3:36). యేసుక్రీస్తునందు విశ్వాస ముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు బొంది, నీ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. అటుతరువాత నీవు మరణము వరకు నమ్మకముగా యున్నయెడల ఆయన నీకు నిత్యజీవిత కిరీటాన్ని బహూకరించును. (యోహాను 14:1, అపొ.కా.2:38, ప్రకటన 2:10).

జాషువా గూటం

# మరణమైన తరువాత - ఏమిటి?
## After Death - What Then?

మరణమును గూర్చియు దాని తరువాత జరుగబోయే దానిని గూర్చియు, ప్రజలు తెలిసికొన గోరుదురు. "సమాధి యనంతరము జీవమున్నదా? లేక మరణముతో సమస్తమును అంతమగునా?" యని వారడుగుదురు. ఈ భూమిపై మరణము ఏలునంతకాలము "మనుష్యుడు మరణించిన యెడల అతడు మరల బ్రతుకునా?" యని మానవులు అడుగుచుందురు (యోబు 14:14)

దేవుడు ఈ అంశముపై మాట్లాడెను. మరణము యొక్క భావమును దాని యనంతరము సంభవించే పరిస్థితులను గూర్చి బయలుపరచబడిన ఆయన వాక్యము మానవునికి తెలియజేయుచున్నది. లేఖనములు అధికార పూర్వకమైనవని అవే ఆఖరి

ఆధారములని గుర్తించబడవలెను (2 తిమో 3:16, 17;1 కొరింథీ 14:37: 2 పేతురు 1:3, 21). 'ఆఖరి సంగతుల సిద్ధాంతమును' బైబిలు వేత్తలు ఈ జీవితాంతము యొక్క భావమును, మరణ, పునరుత్థానముల మధ్య గల సమయమును క్రీస్తు రెండవ రాకడను, ఆఖరి తీర్పును, నిత్యగమ్యమును బైబిలు బోధనుబట్టి నిర్వచించుట కుపయోగించుదురు.

## 1. మానవుడెవరు ?

మరణానంతరము మానవుని గమ్యమును పరిశోధించునప్పుడు మానవుని యొక్క ఆరంభము, తత్వము అతని నిర్మాణములను కూడ పరిశోధించుట అత్యవసరము. మానవుడెవరు మరియు అతడెక్కడ నుండి వచ్చెను? "నీవు మనుష్యుని జ్ఞాపకము చేసికొనుటకు వాడేపాటివాడు?" (కీర్తన 8:4). దీనికి రెండే రెండు జవాబులున్నవి. 1. మానవుడు అనేక యుగముల తరబడి జరుగుచుయున్న పరిణామ కార్యక్రమమువలన పరిణమించిన ఒక జంతువు; లేదా 2. మానవుడు దేవునిచే సృజింపబడిన ఒక ఆత్మీయ వ్యక్తి. మానవుడు అల్పజీవరాసుల నుండి పరిణమించిన వాడై కేవలము మర్త్యుడేయని కొందరు చెప్పునది నిజమే అయిన యెడల మరణించినవారిని గూర్చిన ప్రశ్నలన్నిటికిని సులభముగా జవాబీయ వచ్చును. మరణించినవారిక లేకుండాపోయిరి. వారు నిర్మూలింపబడిరి. మరియు చనిపోవువారందరు కూడ అట్లే నిర్మూలించబడుదురు.

మానవుని ఆరంభమును గూర్చియున్న పరిణామ సిద్ధాంతము (Theory of Evolution) ఎప్పుడు నిరూపించబడలేదు, నిరూపించబడనేరదు. మానవుని ఆరంభమును గూర్చియు, అతని తత్వమును గూర్చియు లేఖనములు వేరుగా బోధించుచున్నవి. మానవుడు దేవుని స్వరూపమందు యెహోవావలన సృజింపబడెనని లేఖనములు ఖచ్చితముగా చెప్పుచున్నవి: "దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను: దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీనిగాను, పురుషునిగాను వారిని సృజించెను" (ఆదికాండము 1:27). ఆ కార్యము యొక్క సరియైన క్రమము ఇట్లు వర్ణించబడెను; "దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను" (ఆది 2:7). దేవుడు మానవుని దూతల కంటే (దేవునికంటే) కొంచెము తక్కువవానిగా చేసి మహిమా ప్రభావములతో

వానికి కిరీటమును ధరింపజేసెను. (కీర్తన 8:5) ఈ బైబిలు వాక్యములు మానవుడు దేవునిచే మిశ్రమవ్యక్తిగా, అంటే ఒక భౌతిక శరీరముతోను, యెహోవా ఊపిరితోను సృజింపబడెనని బోధించుచున్నవి. మనుష్యులకును జంతువులకును ఒక గొప్ప భేదమున్నది. మానవుడు దేవుని స్వరూపమందు సృజింపబడెను గాని జంతువులు అట్లు సృజింపబడలేదు (ఆది.కా. 1:27).

మానవుని సంపూర్ణ తత్వమంతయు శరీరము, జీవము, ఆత్మ అని అపొ.పౌలు బోధించుచున్నాడు. "మీ ఆత్మయు, జీవమును, శరీరమును మన ప్రభువైన ఏసుక్రీస్తు రాకడయందు నిందారహితముగాను సంపూర్ణముగాను ఉండునట్లు కాపాడబడునుగాక" (1 థెస్స 5:23). శరీరము అనగా మాంసము లేక భౌతిక భాగము. జీవమనగా భౌతిక జీవమని కొన్నిసార్లు చెప్పబడెను. (కీర్త 78:50). అది అనేకసార్లు మానవుని సంపూర్ణ తత్వమును సూచించును (అపొ.కా.2:41;1 పేతురు 3:20). ఆత్మ అనగా అమర్త్యమైన (immortal) మానవుని తత్వము. ఇంగ్లీషులో Soul మరియు Spirit అను పదములు కొన్ని సారులు సరిసమానముగా వాడబడెను. లేఖనములు మానవుడు శరీరము, ఆత్మయని తరుచు చెప్పుచున్నవి (రోమా 8:10;1 కొరింథీ 7:34; 5:5; లూకా 8:55; అపొ.కా. 2:31; ఆది 35:18; 2 రాజులు 17:21, 22). మానవుడు బాహ్యపురుషుడు, అంతరంగ పురుషుడు అని చెప్పినప్పుడు పౌలు మానవుని మిశ్రమ తత్వమును మరల సూచించెను (2 కొరింథీ 4:16). శరీరములో ఆత్మ నివసించును.

"దానియేలను నేను నా దేహములో మనో దుఃఖము గలవాడనైతిని" యని దానియేలు పలికెను (దాని 7:15). మనుష్యుని యొక్క యదార్థమైన 'నేను' అనునది శరీరములో నివసించు అదృశ్య ఆత్మ. మనుష్యుల అంతరంగములో జీవాత్మను సృజించువాడు యెహోవా యని జెకర్యా చెప్పెను (జెకర్యా 12:1). మరల, "అయినను నరులలో ఆత్మ ఒకటి యున్నది. సర్వశక్తుడగు దేవుని ఊపిరి వారికి వివేచన కలుగుజేయును" (యోబు 32:8). "మంటి యిండ్లలో నివసించువారు కలరు" (యోబు 4:49: 44:22). గనుక మానవుడు శరీరములో నివసించుచున్న ఒక ఆత్మ, ఆ యాత్మయే అతని నిజ వ్యక్తిత్వము.

మానవుని ఆత్మ దేవుని సంతానమై యున్నందున అది తండ్రివలె యుండి అమర్త్యమైనదని బైబిలు బోధించుచున్నది. దేవుడు ఆత్మయై యున్నాడు (యోహాను

4:24). మన శరీరసంబంధులైన తండ్రులకు వ్యత్యాసముగా దేవుడు మన ఆత్మలకు తండ్రి (హెబ్రీ 12:9). మనము దేవుని సంతానమై యున్నామని పౌలు ప్రకటించెను. (అపొ.కా.17:29). దేవుడు ఆత్మయైయున్నాడు. మరియు మానవుని ఆత్మ దేవుని సంతానమై యున్నది. దేవుని నుంచి కలిగిన ప్రత్యేక వ్యక్తి ఆత్మ గనుక అది మానవుని అమర్త్యభాగమై యున్నది. శరీరము ద్వారా మానవుడు ఈ భూమితో సంబంధము కలిగియున్నను తన ఆత్మ ద్వారా అతడు దేవుని స్వరూపమందు ఉన్నాడు. ప్రతి జాతినుండి ఆ జాతియే ఉద్భవించును. దేవుడు మానవుని ఆత్మను తన అమర్త్య ఆత్మను బట్టి సృజించెను. గనుక మానవుని ఆత్మ అమర్త్యమైనది. (1 తిమో 1:17). దేవుడు నిత్యుడు (కీర్త 90:1,2); సమస్త జీవమునకు ఆధారభూతుడు (యోహాను 5:26; 1 తిమో 6:16; లూకా 3:38). మరియు దేవునివలె మానవుడు అమర్త్యుడు. ఏలయనగా అతని ఆత్మ దేవుని స్వరూపమందు సృజింపబడెను.

దేవుని "శాశ్వతకాల జ్ఞానమును నరుల హృదయమందుంచి యున్నాడు" (ప్రసంగి 3:11; సామె 20:27). హృదయపు అంతరంగ పురుషుడు అక్షయమైన వాటితో అలంకరించబడవలెనని పేతురు చెప్పెను (1 పేతురు 3:4). హృదయ ఆత్మల అంతరంగ పురుషుడు (రోమా 7:22) అసలు మనుష్యుడు; అక్షయమైనది అనగా అమర్త్యమైనది. " మీ హృదయములు నిత్యము బ్రతుకును" అని దావీదు పలికెను. (కీర్తన 22:26); శరీరము మాత్రమే మర్త్యమైనది (రోమా 6:12; 8:11; 2 కొరింథీ 4:11). కాని పునరుత్థానము నందు అదికూడ అమర్త్య మగును (1 కొరింథీ 15:42-45; రోమా 2:7).

మానవుని ఆత్మ గాలిని, ఊపిరిని సూచించక మానవునిలో వివేక విశిష్టమైన భాగమును, మరణము నొందని ఆత్మను సూచించుచున్నది. మానవునిలో దేవుని స్వరూపము మానవునికున్న దైవ లక్షణములగు నైతిక తత్వము, జ్ఞానములను కలిగియున్నది (యాకోబు 3:9). మానవుని ఆత్మ మానవుని సంగతుల నెరిగియున్నట్టిది: "ఒక మనుష్యుని సంగతులు అతనిలోనున్న మనుష్యాత్మకేగాని మనుష్యులలో మరి ఎవరికి తెలియను?" (1 కొరింథీ 2:11; ఆది 6:5; యోబు 38:36; రోమా 10:1, 10). పౌలు ఆత్మతో దేవుని సేవించెను. మనస్సుతోను సేవించెను (రోమా 1:9; 7:25, 22; ఎఫెసీ 4:23). మానవుని ఆత్మమంటిలో నుండి గాక నిత్య దేవునినుండి కలిగెను గనుక ఆత్మనిత్యము

ఉండునట్టిదియు, శరీరము క్షీణించిపోయినను అది జీవించు నట్టిదియునని పమ్ముట సమంజసమే.

Thayer (Greek - English Lexicon) ఆత్మను ఇట్లు నిర్వచించెను: "వివేక విశిష్టమైన ఆత్మ, మానవుడు దేనివలన భావించునో, ఆలోచించునో, యిచ్ఛయించునో, ఆశక్తి: the soul", " అది శరీరము నుండి వేరైనట్టిది, మరణము వలన క్షీణించనట్టిది".

అందువలన యెహోవాచే సృజింపబడిన మానవుడు మరణానంతరము కూడ జీవించునట్టి అమర్త్య ఆత్మయై యున్నాడు. కంటికి కనబడు అతని భౌతికకాయము విషయమైతే మానవుడు మర్త్యుడు: కాని మరణములేని, దేవుని నుండి కలిగిన అంతరంగిక జ్ఞానము గల ఆత్మ విషయమైతే అతడు అమర్త్యుడు.

## 2. మరణ మనగా యేమిటి ?

శరీరమునుండి ఆత్మ ఎడబాటగుట భౌతిక మరణమని బైబిలు బోధించుచున్నది: ఆ ఎడబాటులో మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును: ఆత్మ దాని దయచేసిన దేవునియొద్దకు మరలపోవును (ప్రసంగి 12:7). శరీరము దాని ఆరంభమునకు మంటికి చేరుకొనును. నిజమైన మనుష్యుడగు ఆత్మ అయితే వాని ఆరంభమునకు, దేవుని యొద్దకు చేరుకొనును (ఆది 3:19). ప్రాణములేని శరీరము మృతము అని యాకోబు 2:26లో వ్రాయబడెను. శరీరము లేకుండ ఆత్మ (ప్రాణము) మృతమైనదని బైబిలు చెప్పుటలేదు గాని ఆత్మ లేకుండ శరీరము మృతమైనదని అది చెప్పుచున్నది. ఆత్మ మరణించదు. మరణమును థేయర్ (Thayer) ఇట్లు నిర్వచించెను: "శరీరము నుండి ఆత్మ (సహజముగా గాని లేక అసహజముగా గాని) వేరగుట ద్వారా భూమిపై జీవము అంతమగుట" (GK-Eng Lex. P.282).

మరణమునందు ఆత్మ శరీరమును విడిచిపెట్టి పోవును: రాహేలు చనిపోయినప్పుడు ఆమె ప్రాణము పోయెను (ఆది 35:17). ఆ దుఃఖ గడియలో శరీరాత్మలు ఒండొరుల నుండి ఎడబాటు పొందెను. ఆత్మను విడిచిపెట్టుట మరణము అని వర్ణించబడియున్నది. ఉదాహరణకు: అబ్రాహాము ప్రాణము విడిచి మృతిపొందెను (ఆది 25:8). యేసు సిలువపై

వ్రేలాడుచు, "తండ్రీ నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాననెను. ఆయన యీలాగు చెప్పి ప్రాణము విడిచెను" (లూకా 23:46; అది 35:29: 45:33: అపొ.కా. 5:15, 10; 7:59,60). మరణమునందు ఆత్మయొక్క ఎడబాటును ఒక పక్షి ఎగిరిపోవుచున్నట్లు బైబిలు పోల్చుచున్నది; "మేము ఎగిరిపోవుదుము" (కీర్తన 90:10). ఈ ఎగిరిపోయే మేము శరీరములు కాదు గాని ఆత్మలు. గనుక ఈ లోకము నుండి ఆత్మ నిష్క్రమించుట మరణమని చెప్పబడెను. రోమాలో ఒక చెరసాలలో యుంటూ మరణము 'వెడలిపోవుట' యని పౌలు పలికెను: "ఈ రెంటిమధ్యను ఇరుకునబడి యున్నాను, నేను వెడలిపోయి క్రీస్తుతో కూడనుండవలెనని నాకు ఆశయున్నది, ఆది నాకు మరిమేలు. అయినను నేను శరీరమందు నిలిచియుండుట మిమ్మును బట్టి మరి అవసరమైయున్నది" (ఫిలిప్పీ 1:23,24). తరువాత "నేను వెడలిపోవు కాలము సమీపమై యున్నది" యని అతడు వ్రాసెను (2 తిమో 4:6); ఇక్కడ 'వెడలిపోవుట' అను మాటకు ఆదిమ గ్రీకుభాషలో ఓడయొక్క లంగరు త్రాళ్లు విప్పుట, లంగరు ఎత్తుట, ప్రయాణమునకై తెరచాపలు ఎత్తుట అను భావము కలదు.

మానవుని శరీరము నిజమైన మనుష్యుడు నివసించే ఒక గుడారము లేక నివాసస్థలము. మరణము అనగా గుడారమును విడిచిపెట్టుట యని చెప్పబడెను (2 పేతురు 1:13-15). అపొ.పౌలు ఇట్లు వ్రాసెను. "భూమి మీద మన గుడారమైన యీ నివానము శిథిలమైపోయినను, చేతివని కాక దేవునిచేత కట్టబడినదియు, నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మనకున్నదని యెరుగుదుము" (2 కొరింధి 5.1). ఈ గుడారములో యుండుటను గూర్చి దేహములో నివసించుటను గూర్చి కూడ అతడు పలికెను (4-8వ). గనుక శరీరాత్మలు రెండు కలసియున్న స్థితియే జీవము. శరీరము నుండి ఆత్మ ఎడబాటు పొందిన స్థితి మరణము.

బైబిలులో చనిపోయినవారిని తిరిగి బ్రతికించే అద్భుతములు కేవలము ఆత్మలను మరల శరీరములోనికి తెచ్చుట వలన జరిగెను. సారెపతులోని విధవరాలి కుమారుని ప్రాణము తిరిగి ఇమ్మని ఏలియా ప్రార్థించెను. "యెహోవా, నా దేవా..... ఈ చిన్నవానికి ప్రాణము మరల రానిమ్మని యెహోవాకు ప్రార్థింపగా యెహోవా ఏలియా చేసిన ప్రార్థన ఆలకించి ఆ చిన్నవానికి ప్రాణము రానిచ్చినప్పుడు వాడు బ్రతికెను" (1 రాజులు 17:21,22)

శరీరము నుండి ప్రాణము వేరైపోయినప్పుడు మరణము వచ్చెను. అతని ప్రాణము మరల రాగా ఆ చిన్నవాడు బ్రతికెను. సమాజ మందిర అధికారియొక్క కుమార్తెను క్రీస్తు లేపినప్పుడు 'ఆమె ప్రాణము తిరిగి వచ్చెను' (లూకా 8:55: అపొ.కా.9:36-41). ఆమె చనిపోయినప్పుడామె శరీరము నుండి ఆత్మ వెడలిపోయెను; ఆమె మరల బ్రతికినప్పుడు ఆమె ఆత్మ తిరిగి రావలసి వచ్చెను. అందువలన ఆమె చనిపోయి యుండగా ఆమె ఆత్మ తప్పక జీవించియుండెను.

## ఆత్మ క్షీణించదు

శరీర క్షీణతలో ఆత్మయొక్క క్షీణత ఇమిడిలేదు. శరీరము నుండి ప్రత్యేకముగ యున్న ఆత్మ, మరణము సంభవించిన తరువాత శరీరము లేకుండ ఉనికిని కలిగియుండలేదు అని నమ్ముటకు లేఖనములలో ఎట్టి ఆధారములు లేవు. భౌతిక దేహములకు వేరై ఆత్మీయజీవులున్నారు; దేవుడు, దూతలు అట్టివారే (యోహాను 4:24; కీర్తన 104:4; లూకా 24:39; హెబ్రీ 1:14). భౌతిక సంబంధము కాని అశరీరియైన మానవుని ఆత్మ భౌతిక దేహముతో కలసి యుండవచ్చు లేక ఉండకపోవచ్చు. నిజానికి మరణమైన తరువాత మానవుని ఆత్మ ఉనికిని కలిగియుండునని బైబిలు అనేకసారులు వక్కాణించుచున్నది. గోత్రకర్తలు చనిపోయి తమ పితరుల యొద్దకు చేర్చబడిరి (ఆది 25:8, 9,17; 35:29; 49:33; సంఖ్యా 20:26; ద్వితీ 32:50). దీని భావము ఒకే ఒక్కటై యుండును; ఈ జీవితము తరువాత కూడ వారు ఉనికిని కలిగియున్నవారితో కలసిరి; ఈ కలయిక ఆత్మల కలయికగాని శరీరముల కలయిక కాదు. దావీదు చనిపోయిన తన కుమారుడు ఇక ఉనికి లేకుండ పోయెనని తలంచలేదు గాని అతడు శరీరము నుండి వేరై వేరొక స్థలమున జీవించుచున్నాడని నమ్మెను. అతడిట్లనెను: "నేను వానియొద్దకు పోవుదును గాని వాడు నాయొద్దకు మరల రాడు" (2 సమూ 12:23). ఈ జీవితమును ఒకా నొకప్పుడు వీడి తన కుమారుని యొద్దకు వెళ్లుటకు అతడు నిరీక్షించెను.

"ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి" యని యేసు చెప్ప నప్పుడు, శరీరము చనిపోయిన తరువాత ఆత్మ జీవించునని యేసు బోధించెను (మత్తయి 10:28: లూకా 12:4); శరీరము చనిపోయి నప్పుడు ఆత్మ చనిపోదు అని దీనిభావము.

సరిగదా మానవుడు చంపలేని ఆత్మ మరణము తరువాత జీవించుచునే యుండును. కాని మనుష్యుడు కేవలము మంటితోను జంతు జీవముతోను తయారైన వాడయితే, శరీరమును చంపువాడు అదే సమయములో ఆత్మను కూడ చంపును.

పశ్చాత్తాపపడి చనిపోవుచున్న దొంగతో క్రీస్తు 'నేడు నీవు నాతో కూడ పరదైసులో యుందువని' సిలువపై చెప్పుట వలన మృతులైనవారు జీవించుచు యుందురని మరింత ధృవపరచబడెను (లూకా 23:43). చనిపోయిన తరువాత ఆ దొంగ ఉనికిని కలిగి యుండె నని ఈ మాటల భావము. అతడు క్రీస్తుతో వెంటనే వేరొక ప్రదేశములో ప్రవేశించబోవు చున్నాడు. వారు చనిపోయిన ఆ దినమందు ఆ దొంగ యొక్క ఆత్మగాని క్రీస్తుయొక్క ఆత్మగాని ఉనికి లేకుండ పోలేదు.

అంతేకాకుండా క్రీస్తు రూపాంతరము పొందినప్పుడు మోషే ఏలియాలు అయనతో మాటలాడిన సందర్భములో ఆత్మ వ్యక్తిగతముగా విదేహియై మానవుని మరణ పునరుత్థానముల మధ్య జీవించునని బోధింపబడెను (మత్తయి 17:1-8, లూకా 9:28-36). క్రీస్తు రూపాంతరము పొందుసరికి 1500 సంవత్సరములకు ముందే మోషే చని పోయెను. మరియు నెబో కొండమీద తెలియని ప్రదేశములో అతని శరీరము పాతిపెట్ట బడెను. ఏలియా కూడ ఈ భూమిమీద నుండి వెడలి పోయి చాల కాలమాయెను. అయినను మోషే ఏలియాలు ఇంక జీవించుచుండిరి: వారు తమ వ్యక్తిగత రూపురేఖలను, వ్యక్తిత్వము ను ఇంకను కలిగియుండిరి. మోషే ఏలియాలు ఇప్పుడు కూడ లేకుండ పోలేదు.

దీనిని ఆలోచించుము! నిరూపింపబడలేని నాస్తికత్వము మానవుని జీవితాంతమున అంధకారమయమైన సమాధి తప్ప వేరొకటి అతనికియ్యలేకున్నది. మానవుడు కేవలము మర్త్యుడేయనియు అతని దేహములో ఆత్మ అనేది లేదనియు అనాత్మవాదులు చెప్పుదురు; చనిపోవుట అనగా ఇంక లేకుండపోవుట; మృతులైనవారు దేవుని మనస్సులో తప్ప కేవలము ఉనికి లేకుండ సంపూర్తిగ స్పృహలేనివారని వారు చెప్పుదురు. (J.F.Rutherford. "Where are the dead?" Watch Tower Bible & Tract society. PP. 29,31). వీరి ప్రకారం మానవుడు చనిపోయినప్పుడు అతడొక చిన్న కుక్కవలె సంపూర్తిగ చనిపోవును! మృతిచెందిన తరువాత అతడు చచ్చిన కుక్కకంటే ఎక్కువ ఏమికాదు.

మానవుడు మృగమువలె శరీరమును మించి జీవించే ఆత్మలేనివాడని ప్రసంగి 3:19,20 బోధించుచున్నదని కొందరు వాదింతురు. అయితే ఆ లేఖన భాగము శరీర విషయములో మనుష్యుని యొక్కయు మృగముల యొక్కయు మృతి ఒకే రీతిగ యుండునని బోధించుచున్నది. వారిద్దరు చనిపోయి వారు వచ్చిన మంటికే తిరిగిపోవుదురు. అయితే ఇంకొక విషయములో వారు చాల వేరుగా యున్నారు: మృగములకు గాక మానవునికి అమర్త్యమైన ఆత్మయున్నది (21). అల్పజాతి జంతువులవలె మానవుని శరీరము భూసంబంధమైనది; అతని మరణము తథ్యము. గనుక ఈ మాటకును కీర్తన 146:4లో చెప్పబడిన 'వారి సంకల్పములు నాడే నశించును' అను మాటకును సంపూర్ణ సమన్వయత యున్నది. అంతే గాకుండా మరణమైన తరువాత మానవుని ఆత్మ దేవుని యొద్దకు పోవును అని ప్రసంగి 12:7 చెప్పుచున్నది.

క్రీస్తు కాలములో సద్దూకయ్యులకు మరణము అనగా సంపూర్ణ నాశనము (annihilation) అనే భావ ముండెడిది; చనిపోయిన వాడొక వ్యక్తి కాదు. శరీరముతో ఆత్మ కూడ చనిపోవునని తలంచే అనాత్మవాదులు (Materialists) వారు, గనుక మరణము తరువాత జీవము గాని పునరుత్థానము గాని ఉండనేరదు, వారు దేవదూతయైనను ఆత్మయైనను లేదనెడివారు (అపొ.కా.23.8).

సద్దూకయ్యులు ఒకనాడు యేసునొద్దకు వచ్చి ఒక స్వల్పమైన సందర్భమును చెప్పిరి. ఏడుగురు మనుష్యులను వరుసగా పెండ్లి చేసుకొనిన ఒక స్త్రీ చనిపోయెను. అయితే ఆ ఏడుగురిలో ఎవడు పునరుత్థాన దినమందు ఆమెకు భర్త యగునని వారు యేసును అడిగిరి. వారు పునరుత్థానమును, భవిష్యత్ జీవమును అపార్థము చేసుకొనిరని యేసు వారికి చెప్పెను: 'లేఖనములనుగాని దేవుని శక్తిని గాని ఎరుగక మీరు పొరబడుచున్నారు. పునరుత్థానమందు ఎవరును పెండ్లి చేసికొనరు. పెండ్లి కియ్యబడరు; వారు పరలోకమందున్న దేవుని దూతలవలె నుందురు''. మోషే వ్రాసిన లేఖనములను బట్టి అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులు ఇంకా జీవించుచున్నారని యేసు వారికి నిరూపించెను. "మృతులు పునరుత్థానమును గూర్చి - నేను అబ్రహాము దేవుడను, ఇస్సాకు దేవుడను, యాకోబు దేవుడనై యున్నానని దేవుడు మీతో చెప్పిన మాట మీరు చదవలేదా? ఆయన సజీవులకే దేవుడు గాని మృతులకు దేవుడు కాదని వారితో చెప్పెను'' (మత్తయి

22:29-32; మార్కు 12:18-27). ఈ మాటలను మండుచున్న పొదలో నుండి దేవుడు ముందు మోషేతో చెప్పునరికి అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులు చనిపోయి అనేక తరములాయెను (నిర్గమ 3:6). అయినను అప్పటికి వారు జీవించుచుండిరి; మరియు ఇప్పుడు కూడ వారు జీవించుచున్నారు. వారి దేహములు మాత్రమే నాశనమయ్యెను. చనిపోయిన మిగతా వారందరి యెడల కూడ ఇది సత్యమే. క్రీస్తు యొక్క వాదనలోని ప్రముఖ సూత్రమే మంటే "దేవుడు సజీవులకు దేవుడు". "ఆయన సజీవులకే దేవుడు కాని మృతులకు దేవుడు కాడు; ఆయన దృష్టికి అందరును జీవించుచున్నారని" యేసు వారికి ఉత్తరమిచ్చినట్లు లూకా వ్రాసెను (లూకా 20:38). ఆత్మ శరీరములో యున్నను, శరీరములో లేకపోయినను ఆయనలో అందరును జీవించుచున్నారు. క్రీస్తు యొక్క సమాధానము సద్దూకయ్యులను ఎల్లప్పటికి సద్దణిచెను.

అనాత్మవాదులు మరణము యొక్క బైబిలు భావమును కోల్పోయిరి. మరణ మనగా ఇక లేకుండ పోవుట యని వారి నిర్వచనము. కాని అది దేవుని నిర్వచనము కాదు. ప్రభువునకు మరణము అనగా యెడబాటు అని అర్థము. లేఖనములలో ఈ మాట నేరుగా గాని లేక అలంకార రీతిగా గాని ఉపయోగింపబడినను మరణ మనగా ఎడబాటేగాని సంపూర్ణ నాశనమని మాత్రము అర్థము కాదు. మూడు రకములైన మరణమున్నది: 1. బౌతికము - శరీరము నుండి ప్రాణము వేరగుట (యాకోబు 2:26; అది 35:18). 2. ఆత్మీయము - దేవుని నుండి ఆత్మ వేరగుట (ఎఫెసీ 2:11; యోహాను 5:25; అది 2:17; యెషయా 59:1,2; మత్తయి 8:22; 1 తిమో. 5:6; 1 యోహాను 3:14). 3. నిత్యము - దేవునితో వేరై నిత్యము నరకములో యుండుట (ప్రక 20:14, 15; 21:8; మత్తయి 25:46; రోమా 6:23; యాకోబు 5:19, 20;2 థెస్స 1:7-9; యెహెజ్కేలు 18:20). పాపము దేవునికిని మానవునికిని మధ్య ఎడబాటును తెచ్చును. కాని ఆత్మ యెన్నడు ఉనికి లేకుండ నాశనము చేయబడదు.

జీవము కూడ ఈ మూడు భావములలో యున్నది: 1. భౌతికము (1 రాజుల 17:21,22; లూకా 8:55); 2. ఆత్మీయము (యోహాను 11:25,26; 8:51;1 యోహాను 5:21;) 3. నిత్యము (మత్తయి 25:46, తీతు 1:3; 3:7; 1 యోహాను 2:25; ప్రకటన 22:14). నిత్య జీవనమునకును నిత్య ఉనికికిని ఒక భేదమున్నది. జీవ మరణములు రెండు పరిస్థితులను

సూచించుచున్నవి: ఐక్యత, ఎడబాటు, మరణమనగా ఒక వ్యక్తి ఇక సంపూర్తిగ లేకపోవుట యని అర్థము కాదు. మానవు లందరికి నిత్య ఉనికి యున్నది. పరిశుద్ధ జీవితము వలన కొందరు ఆనందము తోను, మిగిలినవారు పాపపు జీవితము వలన నిత్యయాతనలోను జీవింతురు. గనుక ఒక విధముగా మానవుడు మరణించి యుండవచ్చును గాని వేరొక విధముగా అతడు జీవించుచున్నాడు; అతడు భౌతికముగా జీవించుచుండినను ఆత్మీయముగా చచ్చినవాడు కావచ్చును.

మరణమైన తరువాత మానవునిలో ఏ భాగము కూడ జీవించదు అని చెప్పువారు పలుమారులు తిరస్కరించబడిన పురాతన సద్దూకయ్యుల సిద్ధాంతమును చెప్పుచున్నారు. అయితే సత్యమేమంటే, భౌతికముగా చచ్చినవారు తమ స్వంత వ్యక్తిత్వములతో ఇంకను జీవించుచున్నారు. వారొకా నొకప్పుడు ఉన్నారు అని కాదు గాని వారిప్పుడును ఉన్నారు. మృతులైనవారు అశరీరులై ఇంకను జీవించుచున్నారు. వారు తమ శరీరముల పునరుత్థాన దినము కొరకు కనిపెట్టుచున్నారు.

(సశేషం) - పెర్రికోతమ్

# Declaration (See Rule 3 )

| | | |
|---|---|---|
| Title of the News Paper | : | **Satya Vakku** |
| Language | : | Telugu |
| Name & Address of The Publisher | : | Joshua Gootam<br>10-4-33/1, Seshagirirao St.,<br>Kakinada - 533 004. |
| Nationality | : | Indian |
| Name of the Printer with address | : | Joshua Gootam<br>10-4-33/1, Seshagirirao St.,<br>Kakinada - 533 004. |
| Place of Printing with address | : | Satyavani<br>Church of Christ, 7-9-35,<br>Samba murthy St.,<br>Kakinada - 533 001. |
| Place of Publishing | : | Satyavani<br>Church of Christ, 7-9-35,<br>Samba murthy St.,<br>Kakinada - 533 001. |
| Name of the Editor | : | Joshua Gootam (Indian)<br>10-4-33/1, Seshagirirao St.,<br>Kakinada - 533 004. |

I, Joshua Gootam declare that particulars in respect of the News paper above are true to the best of my knowledge and belief.

Sd/-
Joshua Gootam

చున్నారు. తాళ్లపూడి ప్రాంతములో జరుగుచున్న పనికొరకు ప్రార్థించమనవి.

ఫిబ్రవరి 11 నుండి 15వ తేదీ వరకు సోదరులు జాషువా గూటంగారు, అమెరికా నుండి వచ్చిన స్టీవ్ సెక్సన్ గారు కలసి పలు గ్రామములలో సువార్త ప్రకటించిరి. ఫిబ్రవరి 11వ తేదీ ఆదివారం కాకినాడ రామారావ్‌పేట క్రీస్తు సంఘ ఆరాధనలో స్టీవ్ గారు వాక్యపరిచర్య చేసిరి. ఆరోజు యిద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఆదివారం మధ్యాహ్నం కందరాడలో జరిగిన కూటములో వాక్య పరిచర్య చేయగా అక్కడ మరి యిద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఫిబ్రవరి 12న తొత్తరమూడిలో జరిగిన సభలో 6గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. 13వ తేదీనాడు కోరుకొండ మండలం నల్లగొండలో జరిగిన సభలో స్టీవ్‌గారు వాక్య పరిచర్య చేయగా 12 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. కందరాడలో ఆర్.ప్రకాశరెడ్డి, రాజారెడ్డిగార్లు, తొత్తరమూడిలో డి.సామ్యేలు, నల్లగొండలో బి.ధర్మరాజు గార్లు సువార్త పరిచర్య చేయుచున్నారు.

ఫిబ్రవరి 14వ తేదీ బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా కురెళ్ళగూడెంలో సువార్తికుల సదస్సు జరిగెను. కష్ణా జిల్లా నుండి, ఉభయ గోదావరి జిల్లాల నుండి వచ్చిన పలు సువార్తికులు సదస్సుకు సకాలములో హాజరై గొప్ప సహవాసములో పాల్గొనిరి. సదస్సు ప్రారంభమునకు ముందు కురెళ్ల గూడెంలో నిర్మించబడిన ఆలయమును సోదరులు స్టీవ్ సెక్సన్ గారు, జాషువా గూటం గారు రిబ్బను కత్తిరించి క్రీస్తు కొరకు ప్రతిష్ఠ చేసిరి. తదుపరి నూతన ఆలయములో సదస్సు జరిగెను. సదస్సులో స్టీవ్‌గారు రెండు గొప్ప ప్రసంగములు చేసిరి. మరియు జి.షద్రక్ (పాలకొల్లు), యన్.మోజెస్ (కరుగోరుమిల్లి), జాషువా గూటం గార్లు కూడ వాక్యపరిచర్య చేసిరి. సదస్సు అనంతరం 15 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. కురెళ్ళ గూడెంలో సోదరులు బుర్రె యోహానుగారు క్రీస్తుకొరకు గొప్ప పనిని చేయుచున్నారు.

ఫిబ్రవరి 15వ తేదీ నాడు స్టీవ్ సెక్సన్ గారు, జాషువా గారు రంగంపేట మండలం శ్రీకృష్ణ పట్టణంలో వాక్య పరిచర్య చేయగా ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. శ్రీ కృష్ణ పట్టణంలో సోదరులు పి.సైమన్‌గారు పనిచేయుచున్నారు.

ఫిబ్రవరి 21 నుండి 25 వరకు జంగారెడ్డి గూడెంలో యున్న క్రీస్తు సంఘము గొప్ప సువార్త కూటములు నిర్వహించిరి. ఆ కూటములలో సోదరులు బి.జాషువా (ఏలూరు), బి.జీవన్ (విజయవాడ), పి.నాగభూషణం (జంగారెడ్డి గూడెం), జాషువా గూటం (కాకినాడ), మరియు చుక్కా జేకబ్ (బెంగుళూరు) గార్లు ఒక్కొక్కరు ఒక్కొక్క దినాన్న వాక్యపరిచర్య చేసిరి. రాత్రివేళ కూటములకు వందలాది ప్రజలు హాజరై సత్యవాక్యము సరిగ విభజింపబడుచుండగా వినిరి. ప్రతిరోజు ఉదయం బైబిలు

త్వరగతి నిర్వహించబడెను. ప్రతిరాత్రి 'క్రీస్తు జీవితం' రంగుల చలనచిత్రం ప్రదర్శించబడెను. దానిని తాడేపల్లి గూడెం నుండి వచ్చిన సోదరులు వి.సహదేవుడుగారు నిర్వహించిరి. సువార్త కూటముల్ల కొరకు స్థానిక సంఘము విస్తృత ఏర్పాట్లు చేసి, జయప్రదముగా నిర్వహించిరి.

ఫిబ్రవరి 26వ తేదీ-సోమవారం పశ్చిమగోదావరి జిల్లా ఆరికిరేవులలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును అమెరికా నుండి వచ్చిన సోదరులు బిల్ పేక్టన్ గారు రిబ్బను కత్తిరించి ప్రతిష్ట చేసిరి. తదుపరి జరిగిన కూటములో వాక్యపరిచర్య చేసిరి. ఈ కార్యక్రమమునకు జాషువా గూటం గారు సతీసమేతముగా హాజరైరి. అలాగే బిక్కవోలు బైబిలు స్కూల్ డైరక్టర్ యస్.జాన్‌గారు కూడ తమ విద్యార్ధి బృందముతో సహా హాజరై ఈ సంతోష కార్యములో పాలుపొందిరి. కూటము అనంతరం 17 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సోదరులు ఎ.విశ్వేశ్వరరావ్ గారు ఆరికిరేవులలోను, కొవ్వూరు ప్రాంతములోను క్రీస్తు సువార్తను చాటుచు, అనాధ పిల్లలకు ఆశ్రయమిచ్చుచు పలువిధములుగా సంఘ క్షేమాభివృద్ధికి కృషిచేయు చున్నారు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/03/2001

From:
**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

To

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. KAKINADA - 533 004. Editor : Joshua Gootam